# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- సైబర్ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ ద్వారకా తిరుమలరావు హెచ్చరించారు.
- ఉత్తరాంధ్ర గిరిజనుల ఆరాధ్యదేవత శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరం ఈరోజు ఘనంగా జరిగింది.
- గుంటూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.
- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తలకు భారంగా భావించవద్దని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు.
- మత్స్య పరిశ్రమలో అవలంబిస్తున్న విధానాలు నేటి తరానికి తెలియాలనే ఉద్దేశంతో ఈరోజు విశాఖహార్బర్ లో ఓపెన్ హౌస్ ప్రదర్శనను నిర్వహించారు.

===========================

గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రభుత్వం చేపట్టిన చర్యలు క్రమంగా సత్ఫలితాలు ఇస్తున్నాయని డీజీపీ ద్వారక తిరుమలరావు తెలిపారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో ఈరోజు ఆయన శాంతి భద్రతలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ మేరకు "ఈగల్ టీమ్" అనే స్పెషల్ ఫోర్స్ ను నియమించామన్నారు. "డిజిటల్ అరెస్టు" పేరిట సైబర్ నేరగాళ్ళు బాధితులను బయపెట్టి నగదు దోచుకుంటున్నారని ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసలు డిజిటల్ అరెస్టు అనేదే లేదని స్పష్టం చేశారు. సైబర్ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టు, హనీ ట్రాప్, మహిళలపై జరుగుతున్న దాడులు, రోడ్డు భద్రత లాంటి పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేశామని డీజీపీ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఉత్తరాంధ్ర గిరిజనుల ఆరాధ్యదేవత శంబర పోలమాంబ అమ్మవారి సిరిమాను సంబరం ఈరోజు ఘనంగా జరిగింది. శంబర పుర వీధుల్లో లక్షలాది మంది భక్తులు అమ్మవారి సిరిమానును దర్శించుకున్నారు. జాతర సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వస్తున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా రేపు అనుపోత్సవ కార్యక్రమం జరగనుంది. ఇదిలా ఉండగా శంబర పోలమాంబకు మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఈరోజు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... శంబర పోలమాంబకు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి కృపతో ప్రతి ఒక్కరికీ శ్రేయస్సు, సుఖసంతోషాలు కలగాలని కోరుకుంటున్నానని చెప్పారు.

==========================

గుంటూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన ఈరోజు జిల్లా సమీక్షా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. 3 గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశం అనంతరం మంత్రి కందుల దుర్గేష్ పాత్రికేయులతో మాట్లాడుతూ... వ్యవసాయం, పౌరసరఫరాలు, రోడ్లు, భవనాలు, జలవనరులు వంటి పలు అంశాలపై జిల్లాలో పరిస్థితిని కూలంకుషంగా చర్చించామని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలుచేస్తున్న దీపం-2, రైతుభరోసా వంటి కార్యక్రమాలు  మరింత మెరుగ్గా ఎలా అమలు చేయాలో సమగ్రంగా చర్చించి, అధికారులకు పలు సూచనలు చేశామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈరోజు ఏలూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. హెల్మెట్ లేకుండా వెళ్ళుతున్న ద్విచక్ర వాహనదారులను స్వయంగా ఆపి హెల్మెట్ ప్రాధాన్యతను వివరించి వారికి హెల్మెట్లను అందజేశారు. హెల్మెట్ ధరించడం తలకు భారంగా ఎంతమాత్రం భావించవద్దని సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వాహనచోధకుల వివరాలను తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారికి ఇకపై ఖచ్చితంగా అపరాధ రుసుం విధించబడుతుందని హెచ్చరించారు.

==========================

భారతీయ మత్స్య పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో విశాఖ ఫిషింగ్ హార్బర్ లో ఈరోజు ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. 6వ నెంబర్ జెట్టీలో మత్స్యదర్శిని, మత్స్య షికారి అనే రెండు పరిశోధనా నౌకల్లో నిర్వహించిన ఈ ఓపెన్ హౌస్ ప్రదర్శనలో FSI డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనాథ్ జోనల్ డైరెక్టర్ డాక్టర్ భామిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. నైపుణ్యవంతమైన చేపల వేట, అందుకు ఉపయోగించే పరికరాలు వంటి అంశాలతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రమాదకర సమయాల్లో ప్రాణాలను కాపాడటం వంటి విధానాలను ఈ ప్రదర్శనలో వివరించారు. ఈ సందర్భంగా FSI డైరెక్టర్ జనరల్ శ్రీనాథ్ మాట్లాడుతూ... నేటి తరానికి మత్స్య పరిశ్రమలో అవలంభిస్తున్న విధానాలు స్వయంగా తెలియాలనే ఉద్దేశంతో ఈ ఓపెన్ హౌస్ లో నిర్వహిస్తున్నామని తెలిపారు.

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

==========================

దిగువ ట్రోపో ఆవరణంలో వీస్తున్న ఈశాన్య గాలుల కారణంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటూ పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రేపు పొగ మంచు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

===========================

భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా రూపొందేందుకు ఏర్పాటు చేసిన "20 సూత్రాల" అమలు తీరుపై చైర్మన్ లంక దినకర్ ఈరోజు నంద్యాలలో స్థానిక పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష అనంతరం లంక దినకర్ పాత్రికేయులతో మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న దేశంగా కాకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 20 సూత్రాలను ఏర్పాటు చేశారని, ఈ 20 సూత్రాల పని తీరు వాటి అమలు అందులో ఉన్నటువంటి సమస్యలను చర్చించడానికి తాను ఈరోజు నంద్యాల రావటం జరిగిందని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో కూడా ఈ 20 సూత్రాల ఫార్ములా అమలు జరుగుతోందని.. అక్కడక్కడ కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నప్పటికీ వాటిని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరించి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని లంక దినకర్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

===========================

పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ లో ఈ నెల 31వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, పోలీసు సూపరింటెండెంట్ అద్నాన్ నయీం అస్మి, సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. పెనుగొండ నగరేశ్వర మహిషాసురమర్దిని దేవస్థానంలో శుక్రవారం నిర్వహించే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా ఈరోజు జిల్లా కలెక్టర్ నాగరాణి తొలుత పెనుగొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి ఆర్ అండ్ బి, మార్కెట్ యార్డ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీ నగరేశ్వర, మహిషాసురమర్దిని, శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానాన్ని సందర్శించి నగరేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

===========================

కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడలు మంత్రిత్వ శాఖ శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో "అంతర జిల్లా యూత్ ఎక్స్చేంజ్" కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా ఉపాధి కల్పన అధికారి కె సుధ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువత, స్థానిక నివాసితుల మధ్య స్నేహాన్ని సృష్టించడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు.

===========================
===========================